# విశాల భారతి


తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 23.06.2025 | 24 క్యారెట్లు 1,00,750 | కిలో వెండి 1,20,000 | 26°C | సంపుటి:3 | సంచిక:176

www.vishalabharati.com


## విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



- విజయ్ దేవరకొండ మరో వివాదంలో చిక్కుకున్నారు
- రెట్రో మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ చేసిన వ్యాఖ్యలు దుమారం
- రాయదుర్గం పోలీస్ స్టేషన్ కేసు నమోదు
- ట్రైబల్స్ లాయర్స్ అసోసియేషన్ ఫిర్యాదు

2

## రైతు భరోసా పంపిణీలో తెలంగాణ సర్కార్ రికార్డు

- ఆరు రోజుల్లోనే రూ. 7,700 కోట్లు పంపిణీ
- జూన్ 16 న రైతు భరోసా నిధులు విడుదల
- ఏడేండ్లలో రైతులకు నిధుల పంపిణీలో ఇదే రికార్డు
- తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమచేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్రంలో జూన్ 16 న రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ప్రొఫెసర్ జయశంకర్వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డి బటన్ నొక్కి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. అయితే కేవలం ఆరు రోజుల్లోనే రూ. 7,700 కోట్లు పంపిణీ చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. రైతులకు వానాకాలంలో పెట్టుబడి సాయం కింద విడుదల చేసిన రైతు భరోసా నిధుల పంపిణీలో తెలంగాణ ప్రభుత్వం రికార్డు సృష్టించింది. గత ఏడేండ్లలో రైతులకు నిధుల పంపిణీలో ఇదే రికార్డు అని పేర్కొంది. జూన్ 16 నుంచి కేవలం ఆరు రోజుల్లోనే రూ. 7,700 కోట్లు పంపిణీ చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు

మిగతా 2లో

## తెలంగాణ ఉప ఎన్నికపై సర్వే..!



- తెలంగాణలో ఉప ఎన్నిక వేడి మొదలైనట్లు తెలుస్తుంది
- ప్రధాన పార్టీలు రంగంలోకి దిగేశాయానే వార్తలు వస్తున్నాయి
- బైపోల్‌పై కసరత్తు మొదలుపెట్టేశాయనే ప్రచారం కూడా జరుగుతుంది
- ఐవీఆర్ఎస్ సర్వేలు తీవ్రమయ్యాయి
- రేపో మాపో జూబ్లిహిల్స్ బైపోల్ నోటిఫికేషన్ విడుదల కానుంది

2



## హైదరాబాద్ ఫ్యూచర్ సిటీకి కొత్త పేరు

- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీకి కొత్త పేరు
- భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో నిర్మాణం
- మెట్రో ఫేజ్-2 పనులపై కీలక అప్డేట్
- రూ. 19,579 కోట్ల అంచనా వ్యయంతో కారిడార్లు

**విశాలభారతి, స్టేట్‌బ్యూరో:**

హైదరాబాద్ మహా నగరంగా విస్తరిస్తోంది. నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలనే టార్గెట్‌తో తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ఉన్న హైదరాబాద్, సైబరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు తోడు ఫోర్త్ సిటీ నిర్మాణానికి రెడీ అయింది. హైదరాబాద్ సౌత్ వైపు ఈ నగరాన్ని ప్రతిపాదించారు. గంతలో దీన్ని ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీగా పిలవగా.. కొత్తగా రేవంత్ సర్కార్ పేరు పెట్టింది. ఫ్యూచర్ నగరానికి 'భారత్ ఫ్యూచర్ సిటీ' గా నామకరణం చేసింది. ఈ పేరుతోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతోంది. ఇటీవలే మెట్రో 2(బి) ప్రతిపాదనలను కేంద్రానికి పంపిన సందర్భంలో కారిడార్-9 (శంషాబాద్ విమానాశ్రయం నుంచి) తుది గమ్యాన్ని 'భారత్ ఫ్యూచర్ సిటీ' గా పేర్కొంది. ఔటర్ రింగ్ రోడ్డు అవతల శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారుల

మిగతా 2లో

## రాష్ట్రంలో 5 రోజులు ఉరుములు, మెరుపులతో వర్షాలు



- తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక ప్రకటన
- నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరిక
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- కొన్నిచోట్ల 30 -40 కి.మీ వేగంతో ఈదురుగాలులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ

మిగతా 2లో




## పసికందుపై ఊడిపడిన సీలింగ్ ఫ్యాన్

గుడిహత్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘోర ప్రమాదం

- రెండురోజుల పసికందుపై ఊడిపడ్డ ఫ్యాన్
- స్వల్ప గాయాలతో బయటపడిన పసికందు
- ఆదిలాబాద్ జిల్లా రిమ్స్‌కి తరలింపు

2






# రైతు భరోసా పంపిణీలో తెలంగాణ సర్కార్ రికార్డు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. అంతేకాక తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో మిగతా నిధులను కూడా వీలైనంత త్వరగా పంపణీ చేపట్టేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

జూన్ 16 న హైదరాబాద్ రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనే రైతు భరోసా నిధులను బటన్ నొక్కి ప్రారంభించారు. నిధుల పంపిణీ ప్రారంభించిన తొలి ఆరు రోజుల్లోనే 66.19 లక్షల మంది రైతులకు రూ. 7770.83 కోట్లు పంపిణీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. జూన్ 21 నాటికే రాష్ట్రంలో 9 ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమైనట్లు తెలిపింది.



# రాష్ట్రంలో 5 రోజులు ఉరుములు, మెరుపులతో వర్షాలు

మొదటి పేజీ తరువాయి

కేంద్రం అంచనా వేసింది. ఈ మేరకు పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు ఇచ్చింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, రంగారెడ్డి, జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే కొన్ని చోట్ కొన్నిచోట్ల 30 -40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అయితే ఈ వర్షాలు ప్రస్తుతం పంటలకు అనుకూలంగా ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసింది. హైదరాబాద్ నగర వాసులు అలెర్ట్ గా ఉండాలని పేర్కొంది. వర్షం సమయంలో విద్యుత్ స్తంభాలు, పెద్ద చెట్ల కింద ఆశ్రయం పొందరాదని అధికారులు సూచనలు చేశారు. మరోవైపు ఏపీలోనూ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు ఏపీలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. విశాఖ,అనకాపల్లి,కాకినాడ,కోనసీమ, తూర్పుగోదావరి , పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం,సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని.. మన్యం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.



# హైదరాబాద్ ఫ్యూచర్ సిటీకి కొత్త పేరు

మొదటి పేజీ తరువాయి

మధ్య ఈ ఫ్యూచర్ సిటీని నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళిక వేస్తోంది. రంగారెడ్డి జిల్లాలోని 7 మండలాలు, 56 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ కొత్త నగరం విస్తరించి ఉంటుంది. కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, ఆమనగల్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలను భారత్ ఫ్యూచర్ సిటీలో చేర్చారు. హెచ్ఎండీఏల మాదిరిగానే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం.. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఆయా మండలాలు, గ్రామాలను ఎఫ్సీడీఏ పరిధిలోకి తీసుకొచ్చారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన అన్ని పత్రాలు, డీపీఆర్లను శనివారం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు హైదరాబాద్ ఎయిర్పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టులో మూడు కారిడార్లు ఉన్నాయి శంషాబాద్ విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ. పొడవైన కారిడార్ను రూ. 7,168 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ. పొడవైన కారిడార్ను రూ. 6,946 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు. జేబీఎస్ నుంచి షామీర్పేట వరకు22 కి.మీ. కారిడార్ను రూ. 5,465 కోట్లతో నిర్మిస్తున్నారు. 86.1 కి.మీ. పొడవును కవర్ చేసే ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టుకు మొత్తం రూ. 19,579 కోట్ల వ్యయం అవుతుందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. గతంలో సమర్పించిన ఐదు కారిడార్ల (76.4 కి.మీ.) ఫేజ్ 2 (ఎ) ప్రాజెక్టు మాదిరిగానే, ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టును కూడా కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు మెట్రో ఎండీ స్పష్టం చేశారు.

## మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ని కలిసిన ఉప్పల



**ఎల్బీనగర్, విశాలభారతి:** టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ని మర్యాద పూర్వకంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు కార్యకర్తల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేలా,పార్టీ పటిష్ఠతకు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉప ఎన్నికపై సర్వే..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ఉప ఎన్నిక వేడి మొదలైనట్లు తెలుస్తుంది. ప్రధాన పార్టీలు రంగంలోకి దిగేశాయానే వార్తలు వస్తున్నాయి. బైపోల్పై కసరత్తు మొదలుపెట్టేశాయనే ప్రచారం కూడా జరుగుతుంది. ఓటర్ల నాడి పసిగట్టేందుకు సర్వేలు చేపడుతున్నట్లు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇంతకీ ఓటర్ల నాడి ఎలా ఉంది? రాజకీయల్లో ట్రెండ్ మారింది. ఇంటింటికి వెళ్లే సర్వే చేసే రోజులు క్రమంగా పోతున్నాయి. ఈ మధ్యకాలంలో ఐవీఆర్ఎస్ సర్వేలు తీవ్రమయ్యాయి. ప్రభుత్వాలు తన పాలన ఎలా ఉందో తెలుసుకునేందుకు కార్యకర్తల ద్వారా తెలుసుకుంటున్నాయి. ఉప ఎన్నికలు వస్తే ఓటర్ల నాడి ఎటువైపు వుందో తెలుసుకునేందుకు సైతం ఆ తరహా సర్వేలు చేస్తాయి. రేపో మాపో జూబ్లిహిల్స్ బైపోల్ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ క్రమంలో ఐవీఆర్ఎస్ సర్వేలు మొదలయయాయి. వివిధ అంశాలపై ఆ సర్వే జరుగుతోంది. బైపోల్లో ఏ పార్టీకి మీరు సపోర్టు చేశారని ప్రశ్నిస్తున్నారు? కేవలం మూడు




ఆప్షన్లు మాత్రమే ఇచ్చారు. ఒకటి అధికార కాంగ్రెస్ పార్టీ, రెండు బీఆర్ఎస్ పార్టీ, మూడు బీజేపీ అన్నది అసలు ప్రశ్న. సర్వేని మళ్లీ వినాలనుకుంటే నాలుగు బటన్ నొక్కింది. ఐవీఆర్ఎస్ సర్వేని ఎవరు జరిపిస్తున్నారో తెలియదు.. తెర వెనుక ఎవరున్నాన్నది తెలీదు. కాకపోతే 8985308447 నెంబర్ నుంచి ప్రజలకు కాల్స్ వెళ్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 18 నెలలు గడిచిపోయింది. దగ్గరలో జమిలి ఎన్నికలు లేవు. దగ్గరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాత్రమే కనిపిస్తోంది. మెజార్టీ ప్రజల అభిప్రాయాన్ని బట్టి ఆయా పార్టీలు తమ అభ్యర్థిని నిలపాలా లేదా అన్నది తెలుసుకోవడానికేనని అంటున్నారు. ఎందుకంటే.. గడిచిన పదేళ్లు భాగ్యనగరంలో కారు జెండా రెపరెపలాడింది. అధికారం పోయిన తర్వాత నేతలు, కార్పొరేటర్లు వలస పోతున్నారు. పరిస్థితి గమనించిన ఓ రాజకీయ పార్టీ సర్వేకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. సర్వే ద్వారా బైపోల్ లో పోటీ చేయాలా? వద్దా అనేది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు సైతం ఉన్నాయి. దానికి కోసం ప్రధాన రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. ప్రజలు తమతో ఉన్నారని బలంగా చెబుతోంది అధికార పార్టీ. బీఆర్ఎస్ కూడా ప్రజలు తమ వైపు చూస్తున్నారని అంటున్నారు. బీజేపీ యాక్టివ్గా లేకపోయినా తన వంతు ప్రయత్నాలు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈ సర్వే జరగడం ఆసక్తిగా మారింది. సర్వేలో ఫలితాలు ఎలా ఉంటాయో తెలీదుగానీ, ఇందులో వచ్చిన ఫలితాలు ఎన్నికల్లో రిపీట్ అవుతుందని చెప్పలేం కూడా. మనశ్శాంతి కోసం నేతలు సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది.



# దళితులు ఆర్థికంగా ఎదగాలి

**అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం జాతీయ కోఆర్డినేటర్ యస్. వరుణ్ కుమార్**

**కూకట్ పల్లి, విశాలభారతి:**

అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ 18 వ కోర్ కమిటీ సమావేశం రెడ్ హిల్స్ లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో సమావేశం జరిగింది. ఇందులో భాగంగా బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జాతీయ కోఆర్డినేటర్ యస్. వరుణ్కుమార్, రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కర్క నాగరాజు లు మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ లోన్స్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి పొందాలని, రాబోయే రోజుల్లో జనాభా లెక్కల్లో క్యాస్ట్ సెన్సస్ లో విధిగా పాల్గొని తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం ద్వారా దళిత సంక్షేమానికి సంబందించిన పథకాలను దళితులకు అందె విదంగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యువత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని వారు కోరారు. త్వరలోనె గ్రేటర్ హైదరాబాద్ కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకుంటారని వక్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు మధుకర్, భాస్కర్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ జైప్రకాష్,రాష్ట్ర కోశాధికారి బాపనపల్లి ప్రమోద్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు శంకర్, అప్పలరాజు,జాయింట్ సెక్రటరీ ప్రభుదాస్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు మంజుల, సాతిరి వినయ్ కుమార్, ఆర్గనైసింగ్ సెక్రటరీ జక్కుల అశోక్, ఖైరతబాద్ నియోజకవర్గం అధ్యక్షులు సునీల్ కుమార్,కర్క మహేష్, చక్రి,రమేష్ పాటిల్, ఎస్టీ అసోసియేషన్ నాయకులు మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# పసికందుపై ఊడిపడిన సీలింగ్ ఫ్యాన్


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెండురోజుల పసి కందుపై సీలింగ్ ఫ్యాన్ ఊడిపడింది. ఇంతలోనే తల్లి అప్రమత్తం కావడంతో రెప్పపాటులో పెను ప్రమాదం తప్పింది. ఫ్యాన్ ఊడిపడే సమయంలో బాలింత తన బిడ్డను రెప్పపాటులో ఒళ్లోకి తీసుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడింది రెండు రోజుల పసికందు.. అనంతరం అప్రమత్తమైన గుడిహథ్నూర్ ప్రాథమిక ఆస్పత్రి సిబ్బంది పసికందును, బాలింత తల్లిను 108 అంబులెన్స్ లో అత్యవసర చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.. తల్లి బిడ్డా ఇద్దరు క్షేమంగా ఉన్నారని రిమ్స్ వైద్యులు తెలపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం గుడిహత్నూర్ మండలం మచ్చాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ పాయల్ పురిటి నొప్పులతో ఇబ్బంది పడటంతో భర్త జాదవ్ కైలాష్ గుడిహథ్నూర్ ప్రాథమిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. కొన్ని గంటల్లోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది పాయల్. తల్లిబిడ్డలిద్దరు జనరల్ వార్డ్ లో చికిత్స పొందుతుండగా.. ఈరోజు ఉదయం ప్రమాదవశాత్తు ఒక్కసారిగా వారి బెడ్ పైన ఉన్న సీలింగ్ ఫ్యాన్ ఊడిపడింది. ఈ హఠాత్పరిణామానికి భయభ్రాంతులకు గురైన తల్లి పాయల్ అంతే వేగంగా తన బిడ్డను పక్కకు లాగడంతో ఫ్యాన్ చివరి భాగం వీపుపై పడింది. దీంతో అలర్ట్ అయిన గుడిహత్నూర్ ఆస్పత్రి సిబ్బంది తల్లిబిడ్డలనిద్దరిని మెరుగైన చికిత్స కోసం రిమ్స్కు తరలించారు. ప్రస్తుతం తల్లిబిడ్డలిద్దరు క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘోరం జరుగుంటే ఎవరు బాధ్యత వహించే వారని నిలదీస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆసుపత్రిలో సౌకర్యాలపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

# విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలుగు సినీ పరిశ్రమలో యువతను ఆకట్టుకుంటున్న నటుడు విజయ్ దేవరకొండ మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల జరిగిన 'రెట్రో' మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్లో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలు తమ మనోభావాలను కించపరిచే విధంగా ఉన్నాయని పలు గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. దీని పర్యవసానంగా.. రాయదుర్గం పోలీస్ స్టేషన్లో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదైంది. విజయ్ దేవరకొండ తమిళ హీరో సూర్య నటించిన 'రెట్రో' సినిమా ఆడియో వేడుకలో మాట్లాడిన మాటలే ఈ వివాదానికి మూల కారణం. కశ్మీర్లోని పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యల్లో.. పాతకాలంలో గిరిజన తెగలు కొట్లాడుకున్నట్టే, ఇప్పుడు ఇండియా, పాకిస్తాన్ దేశాలు కొట్లాడుకుంటున్నాయి అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అతను మాట్లాడిన మాటలు గిరిజనులను, వారి చారిత్రక నేపథ్యాన్ని అవమానించేలా ఉన్నాయని ట్రైబల్స్ లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషన్రాజ్ చౌహాన్ సహా పలు గిరిజన సంఘాలు తప్పుబట్టాయి. ఆదివాసీ సమాజానికి వేల సంవత్సరాల గొప్ప చరిత్ర, విభిన్న సంస్కృతులు, ప్రత్యేక జీవనశైలి, పర్యావరణ పరిరక్షణలో విశేషమైన



పాత్ర ఉంది. కేవలం కొన్ని తెగల మధ్య జరిగిన అంతర్గత ఘర్షణలను ఆధునిక దేశాల సైనిక ఘర్షణలతో పోల్చడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని, ఇది వారిని అనాగరికులుగా చిత్రీకరించడమేనని గిరిజన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాదరణ పొందిన నటులు మాట్లాడేటప్పుడు వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విజయ్ దేవరకొండ వ్యాఖ్యలపై ఆదివాసీ, గిరిజన సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. చాలా చోట్ల పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలోనే రాయదుర్గం పోలీసులు విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ చట్టం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సభ్యుల పట్ల వివక్ష, అవమానాలను నిరోధించడానికి ఉద్దేశించబడింది. ఇది వారి హక్కులను, గౌరవాన్ని కాపాడుతుంది. నిజానికి.. విజయ్ దేవరకొండ తన వ్యాఖ్యలపై అప్పుడే సోషల్ మీడియా వేదికల ద్వారా వివరణ ఇచ్చారు. 'వందల ఏళ్ల క్రితం రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు, గొడవలు చోటు చేసుకునేవి. ఆ ఉద్దేశ్యంతోనే 'ట్రైబ్స్' అనే పదం వాడాను. ఇప్పుడున్న షెడ్యూల్డ్ ట్రైబ్ని ఉద్దేశించి నేను ఈ వ్యాఖ్యలు చేయలేదు. అయినా కూడా నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని ఎవరైనా బాధపడితే అందుకు నేను తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను' అని ఆయన అన్నారు. క్షమాపణ చెప్పినప్పటికీ కేసు నమోదు కావడం ఆయన అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. పోలీసులు ప్రస్తుతం ఈ కేసుపై విచారణ జరుపుతున్నారు. విజయ్ దేవరకొండ ఉద్దేశ్యం, వ్యాఖ్యల ప్రభావంపై న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నారు.



# బిజెపి ఆధ్వర్యంలో సర్వీస్ రోడ్లు పరిశీలన

**చౌటుప్పల్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలో సర్వీస్ రోడ్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సర్వీస్ రోడ్లు నేటికీ నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్ల వెంట ఉన్న వ్యాపారులను, చిరు వ్యాపారులని కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్యే,మంత్రి ఈ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సర్వీసు రోడ్ల నిర్మాణ జాప్యానికి కారకులని విమర్శలు చేశారు. కేంద్రం114 కోట్లు విడుదల చేసినా పనులు నేటికీ ఆలస్యం అవుతున్నవి. సంవత్సరం క్రితం మొదలైన సర్వీస్ రోడ్లు,.సర్వీస్ రోడ్డు వెంట ఉన్న డ్రైన్ నిర్మాణం నాణ్యత లేకుండా నిర్మిస్తున్నారని సంబంధాధికారులకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎన్నిసార్లు విన్నవించిన కదలిక లేదని ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం ఆలస్యం కావడంతో సర్వీసు రోడ్ల ఎరుకుగా మారి అనేక ప్రమాదాలు జరిగి పోయి కొందరు క్షతగాత్రులుగా మిగిలినారు. పట్టణంలో రోడ్డులో ఉన్న చిరు వ్యాపారులు జీవనోపాధి కోల్పోవుచున్నారు. వారికి వెంటనే సంతలో ఉన్న స్థలాన్ని కేటాయించాలని బీజేపీ డిమాండ్ చేశారు. పర్యటనలో దూడల బిక్షం గౌడ్,రమణ గోని శంకర్,కైరం కొండ అశోక్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి చినుకని మల్లేశం,పోలోజు శ్రీధర్ బాబు,రిక్కల సుధాకర్ రెడ్డి దిండు భాస్కర్, ఉబ్బు బిక్షపతి కట్ట కృష్ణ,పబ్బు వంశీ, యాస అశోక్ రెడ్డి,కడారి ఐలయ్య,వనం ధనంజ య, గోషిక పురుషోత్తం అమృతం దశరథ, బడుగు కృష్ణ పబ్బతి శేఖర్,తోకల సాయి బుడ్డ సురేష్, గుండె బోయిన వేణు పాలం అశోక్, ఒంగాల రమా కాంత్, కానుగు కొండల్ తదితరులు పాల్గొన్నారు.




# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**తొర్రూరు, విశాలభారతి:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో ఏర్పాటుచేసిన పాలకుర్తి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అమలుకు నోచుకోని హామీ లు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలకు పూటకో మాట చెబుతూ కాలం వెళ్లదీస్తుందన్నారు. కెసిఆర్ హయాంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండ సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కురుమ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తా

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్, విశాలభారతి:**



కురుమ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం చిలుక నగర్ డివిజన్ పరిధిలోని బీరప్ప గడ్డ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న భవన నిర్మాణం వద్ద జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొని నిర్మాణానికి సంబంధించిన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుమర్తి రాజు కుటుంబానికి పరామర్శ

- **పరామర్శించిన టిపిసిసి స్పోక్ సన్ సామ రామ్మోహన్ రెడ్డి**



కూకట్ పల్లి, విశాలభారతి: గత కొంత కాలంగా కూకట్ పల్లి రాందేవ్ రావు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు తండ్రి చిరుమర్తి సోమయ్య ను ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్, టిపిసిసి స్పోక్ పర్సన్ సామ రాంమోహన్ రెడ్డి పరామర్శించారు. సోమయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని రామ్మోహన్ రెడ్డి వైద్యులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సోమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

# ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం




**రాజేంద్రనగర్, విశాలభారతి:**

ఓ ఫర్నిచర్ గోదాం లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటన మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రిపురం అలీ భాయ్ మసీదు సమీపంలో ఆదివారం ఉదయం మారు 9 గంటలకు జరిగింది. ఎస్సై విశ్వనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్ కే జి ఎన్ గోడౌన్ లో యజమాని జహంగీర్ ఫర్నిచర్ నిల్వ ఉంచాడు. ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు గోదాంకు నిప్పంటుకోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీగా మంటలు వ్యాపించడంతో వాటిని అదుపులోకి తీసుకురావడానికి సమయం పట్టింది. ఇలా ఉండగా గోదాం లో నుంచి కొంత భాగం మరో ప్రాంతానికి ఫర్నిచర్ తరలించామని యజమాని జహంగీర్ తెలిపాడు. ఆస్తి ఎంత మేరా నష్టం జరిగిందో అనే వివరాలు తెలియ రాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించండి

- **ఏఈ కోరిన మల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కప్పర సాయి**



నాచారం జూన్, విశాలభారతి: మల్లాపూర్ 5వ డివిజన్ పరిధిలో నీ బాబా నగర్ లో డ్రైనేజ్ పొంగి పోర్లడం తో మంచి నీటి నాళ్లలో డ్రైనేజ్ వాటర్ రావడం వలన ఇబ్బంది పడుతున్న బస్తీ వాసులు ఈ సమస్యల ను వెంటనే పరిష్కరించాలని స్థానిక ఏఈ కోరిన మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్, మల్లాపూర్ డివిజన్ మైనార్టీ అధ్యక్షులు ఫాసుదిన్, మల్లాపూర్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మనోహర్, మరియు బస్తీ వాసులు మనోజ్ కుమార్ రాజేష్,ప్రశాంత్, రాజు, పాల్గొన్నారు.

# రైతు భరోసా ఎగ్గొట్టడం సిగ్గుచేటు

- **రైతు భరోసా ఇవ్వకుంటే రణరంగమే**
- **జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి**
- **ఊరూరా ఉద్యమానికి శ్రీకారం**
- **తులేకలాన్ లో పెద్ద ఎత్తున రైతుల ఆందోళన**
- **సియం దిష్టి బొమ్మను దగ్ధం చేసిన రైతులు**
- **ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**



రెండు లక్షల కుటుంబాలకు రైతు భరోసా ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలుపన్నడం సిగ్గుచేటని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. రైతు భరోసా ఇవ్వకుంటే రైతు ఉద్యమం రణరంగంగా మారుతుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు భరోసా ఎగబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా తులేకలాన్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆ గ్రామ రైతులు , బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేసి , సియం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఊరూరా రైతు ఉద్యమానికి శ్రీకారం చుట్టామని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేవరకు పోరాడుతామని చెప్పారు. శివారు ప్రాంతాల్లో రైతు భరోసా నిలిపివేయడంతో రంగారెడ్డి జిల్లాలో 60 వేల కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతు కంట కన్నీరు పెట్టిస్తున్న రేవంత్ సర్కార్ కు తగు సమయంలో తగిన గుణపాఠం చెప్పడానికి రైతన్నలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. రెండు పంటలకు కాదు మూడు పంటలకు పంట పెట్టుబడి , ఎకరాకు ఏడాదికి 15 వేలు , రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఎకరాకు 15 వేలు , వ్యవసాయ కూలీలకు , ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 12 వేలు , అన్ని పంటలకు క్వింటాలుకు 500 ల సబ్సిడీ తదితర హామీలను గత ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో గుప్పించిన కాంగ్రెస్ పార్టీ వాటిని తుంగలో తొక్కిందని విమర్శించారు. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు డబ్బులు ఆపలేదని , ఊరూరా కొనుగోలు కేంద్రాలు కూడా పెట్టి రైతుల పంటలను కొనుగోలు చేసిందని ఆయన గుర్తుచేసారు. రైతుబంధు కేసీఆర్ ను వదులుకొని రాబందు కాంగ్రెస్ ను తెచ్చుకొని తప్పు చేశామని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ఆందోళనలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి , ఎంపి పటేల్ గూడ సొసైటీ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్ రెడ్డి , మండల రైతుబంధు అధ్యక్షుడు మొద్దు అంజిరెడ్డి , మాజీ సర్పంచులు చిలుకల యాదగిరి , కొంగర బీరప్ప , యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు జెర్కోని రాజు , గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు గుజ్జ యాదగిరి , రైతు నాయకులు యెర్నాగి యాదయ్య , సామ జంగారెడ్డి , బండ అంజయ్య , బాకారం మల్లారెడ్డి , జక్కుల మల్లయ్య , హనుమండ్ల ఆంజనేయులు , జక్కుల వెంకటేష్ , సుర్వి భాస్కర్ గౌడ్ , అచ్చన కృష్ణ రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుకు 'భరోసా' ఏదీ..?

- **రైతుభరోసా రైతులకు నిరాశే మిగిల్చింది**
- **మండలంలో సగం మంది రైతులకు రైతు భరోసా నిధులు జమ కాలేదు**
- **సర్కార్ పై బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కొండాపురం శ్రీశైలం విమర్శ**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**




కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న రైతుభరోసా రైతులకు నిరాశే మిలిగిల్చిందని బీఆర్ఎస్ పార్టీ నందివనపర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు కొండాపురం శ్రీశైలం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమి ఉన్న రైతులకు కొంత మేరకే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసి కాంగ్రెస్ సర్కార్ చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఏడాదికి రెండు సార్లు రైతుబంధు సకాలంలో అందేదని, కాంగ్రెస్ వచ్చాక కొంతమందికి ఒక్కసారి కూడా పడలేదని వాపోయారు. అలాగే నందివనపర్తి గ్రామంలో దాదాపు సగం మంది రైతులకు రైతు భరోసా దక్కలేదని అన్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు సైతం కార్యాలయానికి వెళ్లి రైతు భరోసా గురించి ఏఈవో, ఏవో తో ఆరా తీయాగా ఫలితం మాత్రం శూన్యం అన్నారు. ప్రభుత్వమే డబ్బులు వేయలేదని.. దీనికి తాము కారణం కాదని అధికారులు చెబుతున్నారన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై
# చర్యలు తీసుకోండి

- **జోనల్ కమిషనర్ కు ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు యుగంధర్ రెడ్డి వినతి**

**కూకట్ పల్లి, విశాలభారతి:**



బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమంగా నిర్మించిన భారీ భవనంపై తక్షణమే చర్యలు చేపట్టాలని కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి శనివారం మధ్యాహ్నం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ ఆ ఓ.ఎస్. నేం97 ఆఫ్ 2024 లోని 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి13వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ జడ్జి, కూకట్పల్లి వారి ఆదేశాల్లో పిటిషనర్ దారుడు ఆవుల రవీందర్ రెడ్డి కూకట్పల్లి సర్కిల్ అధికారులు ఆకారంగా అడ్డుతగుతున్నారని వేసిన టెంపరరీ ఇంజక్షన్ ను డిస్మిస్ చేసింది. ఇదే కాకుండా గతంలో ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్ ను వ్యాకేట్ చేయడం జరిగిందని తెలిపే కోర్టు కాపీని జోనల్ కమిషనర్ కు అందజేస్తూ పూర్తి వివరాలు వివరించారు. తక్షణమే కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమంగా నిర్మించిన భవనానికి వ్యాకేట్ నోటీసు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# అవసరార్థులకు అండగా నిలవాలి

- **లయన్స్ సేవా తరుణి అధ్యక్షురాలుగా శ్రీదేవి రెడ్డి బాధ్యత స్వీకరణ**

**తొర్రూరు, విశాలభారతి:**



సమాజంలో అవసరార్థులకు లయన్స్ క్లబ్ లు అండగా నిలిచి సామాజిక కార్యక్రమాల నిర్వహణతో అందరి ఆదరణ పొందుతుందని లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు.2025-2026 సంవత్సరానికి సేవా తరుణి నూతన అధ్యక్షురాలిగా తుమ్మూరు శ్రీదేవి రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా కూన పద్మావతి,కోశాధికారి వేముల మంజుల తో పాటు కార్యవర్గ ప్రతినిధులచే ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న తరుణంలో తొర్రూరులో సేవా తరుణి క్లబ్ పేరున అతివలంత కలిసి ఉత్తమ సేవలు అందిస్తూ ఎన్నో రకాల సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుపేదలకు సేవ చేయాలన్న ప్రధాన సంకల్పంతో సేవా తరుణి ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమాలు జిల్లాలోనే అనేక క్లబ్ లకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్,జిల్లా గవర్నర్ నిర్దేశించిన కార్యక్రమాలను ఈ ఏడాది నూతన కార్యవర్గం సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.నూతన అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి మాట్లాడుతూ సేవా తరుణి పూర్వ కార్యవర్గాలు నిర్వహించిన కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తూ మరింత సేవలను విస్తృత పరుస్తామని చెప్పారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి కనీస విద్యా అవసరాలను తీర్చే దిశగా కార్యచరణ రూపొందించుకొని జిల్లా, లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు, పూర్వ గవర్నర్లు, క్లబ్ పూర్వ బాధ్యులు, సభ్యుల సహకారంతో కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎన్.సుధాకర్ రెడ్డి, పి.హరికిషన్ రెడ్డి, పూర్వ గవర్నర్లు డాక్టర్ కే. రవీందర్ రెడ్డి, టి. లక్ష్మీ నరసింహారావు, కన్నా పరశురాములు, జిల్లా బాధ్యులు సిహెచ్. రఘునాథరెడ్డి, డాక్టర్ వి. శారద, ఆర్. వెంకన్న, డాక్టర్ పి. కిరణ్ కుమార్, రేవూరి రమణారెడ్డి, డాక్టర్ సురేష్ గారు,చంద్రగిరి ప్రసాద్, అజిత్, రాజమౌళి, రీజియన్ చైర్మన్ డి. సరేష్, రాజేశ్వరి, ఉషా మార్త, పెద్ది రేవతి, సంయుక్త,జోన్ చైర్మన్లు ఆర్. శ్రీదేవి,దీప,క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ఎస్. నాగవాణి, రజిత, శైలజ,రాధిక,మణి,రేణుక దేవి,క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
సోమవారం
23.06.2025
హైదరాబాద్



# వెంకీ రాకకు వేళాయే!



కథానాయకుడు చిరంజీవి తన 157వ చిత్రాన్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఇందులో వెంకటేశ్ ప్రత్యేక పాత్రలో కనువిందు చేయనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. కాగా, ఇప్పుడీ పాత్ర కోసం ఆయన రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. త్వరలో హైదరాబాద్‌లో మొదలు కానున్న కొత్త షెడ్యూల్‌లో తను ఈ చిత్ర సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నట్లు సమాచారం. వెంకీ పాత్రకు ఈ కథలో ఎంతో ప్రాధాన్యముందని.. దీనికోసం ఆయన దాదాపు నెల రోజుల డేట్స్ కేటాయించారని, జులై నెలాఖరు నాటికి తన పాత్ర చిత్రీకరణ పూర్తి కానుందని తెలుస్తోంది. ఆ వెంటనే ఆయన త్రివిక్రమ్ దర్శకత్వంలో కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించనున్నట్లు తెలిసింది. ఇక చిరు – అనిల్‌ల సినిమా ఇటీవలే ముసూరీలో రెండో షెడ్యూల్ ప్రారంభించుకోగా.. తాజాగా ఇది పూర్తయినట్లు చిత్ర బృందం ప్రకటించింది.

# నా శరీరం.. నా ఇష్టం



తనకి సంబంధించిన ఏ విషయాన్నైనా ఉన్నది ఉన్నట్లుగా చెప్పేందుకు ఇష్టపడుతుంటుంది నటి శ్రుతిహాసన్. తన ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న విషయాన్ని ఎన్నో ఇంటర్వ్యూల్లో స్వయంగా పంచుకున్న ఆమె ఇదే అంశంపై మరోసారి తనదైన శైలిలో స్పందించింది. ''టీనేజ్‌లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చేది కాదు. అందుకే సర్జరీ చేయించుకున్నా. అలాగే ముఖం మరింత అందంగా కనిపించేందుకు ఫిల్లర్స్ కూడా వాడా. దీంట్లో దాచుకునేది ఏమీ లేదు. నేను ఎన్నో సందర్భాల్లో ఈ విషయాల్ని చెప్పా. కొందరు వీటిని బయటకు చెప్పడం ఎందుకని దాచుకుంటారు. నేను వాళ్ల అభిప్రాయాల్ని గౌరవిస్తాను. కానీ, నాలా ధైర్యంగా చెప్పుకునే వాళ్లనూ తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఏమో భవిష్యత్తులో వయసు పైబడ్డాక ఫేస్ లిఫ్ట్ కూడా చేయించుకుంటానేమో. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. నా శరీరం నా ఇష్టం. ఇతరులకు ఇబ్బంది లేనప్పుడు దాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఏముంది'' అని శ్రుతి తన అభిప్రాయాన్ని పంచుకుంది. ప్రస్తుతం ఆమె రజనీకాంత్‌తో 'కూలీ'లో నటిస్తోంది. ఇది ఆగస్టు 14న థియేటర్లలోకి రానుంది.

# ఆయుష్మాన్, సారా జంటగా మరొకటి..





'మెట్రో ఇన్ దినో'తో త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది బాలీవుడ్ కథానాయిక సారా అలీఖాన్. ఇంకా ఈ సినిమా విడుదల కాకముందే తన రాబోయే ప్రాజెక్టుల కోసం సన్నద్ధమవుతోందామె. ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తిన 'పతి పత్నీ ఔర్ వో'కు సీక్వెల్ రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో ఆయుష్మాన్ సరసన సారా ఎంపికైనట్లు సమాచారం. ''ఆయుష్మాన్, సారా ప్రధాన పాత్రల్లో ధర్మా ప్రొడక్షన్స్ ఓ కామెడీ చిత్రాన్ని రూపొందిస్తోంది. ఇప్పుడీ కాంబినేషన్‌లోనే 'పతి పత్నీ ఔర్ వో 2'ను తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తుంది చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయి. త్వరలో ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించనున్నార''ని సారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# నూతన శతకారంభం



అండర్సన్–తెందుల్కర్ ట్రోఫీని భారత్ ఘనంగా ఆరంభించింది. అయిదు టెస్టుల సిరీస్ మొదటి మ్యాచ్‌లో తొలి రోజు, శుక్రవారం బ్యాట్‌తో అదరగొట్టిన టీమ్‌ఇండియా.. 3 వికెట్లకు 359 పరుగులతో భారీ స్కోరు దిశగా సాగుతోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (127 బ్యాటింగ్; 175 బంతుల్లో 16×4, 1×6), ఓపెనర్ యశస్వి జైస్వాల్ (101; 159 బంతుల్లో 16×4, 1×6) సెంచరీలతో ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలిచారు. రాహుల్ (42; 78 బంతుల్లో 8×4) కూడా రాణించాడు. ఆట చివరికి శుభ్‌మన్‌తో కలిసి వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ (65 బ్యాటింగ్; 102 బంతుల్లో 6×4, 2×6) క్రీజులో ఉన్నాడు.

**ఆరంభం అదిరింది.. కానీ:** 91/0.. కాసేపట్లో లంచ్ అనగా భారత్ స్కోరిది. టాస్ గెలిచి తమను బ్యాటింగ్ దించిన ఇంగ్లాండ్ నిర్ణయం తప్పని నిరూపిస్తూ తొలి సెషన్ ఆఖరి దాకా టీమ్‌ఇండియా పైచేయి సాధించింది. కానీ 6 నిమిషాల వ్యవధిలో.. 6 బంతుల తేడాలో ఇంగ్లాండ్ మ్యాచ్‌లోకి వచ్చింది. అంతకుముందు బ్యాటింగ్‌కు దిగిన భారత్ జాగ్రత్తగా ఆడింది. యశస్వి జైస్వాల్‌తో ఎవరు జతగా వస్తారనే చర్చకు తెర దించుతూ అనుభజ్ఞుడైన కేఎల్ రాహుల్ ఓపెనింగ్ చేశాడు. ఆరంభంలో స్వింగ్‌తో ఇంగ్లాండ్ పేసర్లు.. యశస్వి, రాహుల్‌ను పరీక్షించారు. కానీ భారత ఆటగాళ్లు ఏమాత్రం తొందరపడలేదు. బంతి గతి తప్పినప్పుడు మాత్రమే షాట్లు ఆడారు. రాహుల్ ముచ్చటైన కవర్‌డ్రైవ్‌లు ఆడితే.. యశస్వి బ్యాక్‌ఫుట్ కట్‌షాట్లు, డ్రైవ్‌లతో స్కోరు పెంచాడు. కాసేపట్లో లంచ్ అనగా ఇంగ్లాండ్.. టీమ్‌ఇండియాను దెబ్బ కొట్టింది.

**గేరు మార్చారు:** తక్కువ సమయంలో రెండు వికెట్లు పడినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి రక్షణాత్మకంగా ఆడలేదు. శుభ్‌మన్ ఒత్తిడి లేకుండా క్రీజులో స్వేచ్ఛగా కదులుతూ షాట్లు ఆడాడు. వోక్స్ వేసిన ఓ ఓవర్లో అతడు మూడు ఫోర్లు కొట్టాడు. ఈ క్రమంలో ఆడిన ఓ స్ట్రెట్‌డ్రైవ్ అద్భుతం. మరోవైపు 45 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కార్స్ బౌలింగ్‌లో యశస్వి ఎల్బీగా ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. మిడిల్ స్టంప్‌కు నేరుగా కార్స్ వేసిన యార్కర్ యశస్వి కాలికి తగిలింది. దీంతో అతడు ఎల్బీగా వెనుదిరగడం ఖాయంగా కనిపించింది. సమీక్షలో కార్స్ నోబాల్ వేసినట్లు తేలడంతో యశస్వికి జీవనదానం లభించింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ యశస్వి అర్ధసెంచరీ చేశాడు. ఈ మైలురాయి అందుకున్నాక దూకుడు పెంచాడు. వోక్స్ ఓవర్లో మూడు ఫోర్లు బాదిన యశస్వి.. టంగ్ బంతిని స్టాండ్స్‌లోకి కొట్టాడు. ఇంకోవైపు జోరు కొనసాగించిన శుభ్‌మన్.. టంగ్ బౌలింగ్‌లో ఫోర్‌తో 56 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. కార్స్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టి 99కి చేరుకున్న యశస్వి.. తర్వాతి బంతికి సింగిల్‌తో ఇంగ్లాండ్‌లో తొలి సెంచరీ నమోదు చేశాడు. టెస్టుల్లో అతడికిది అయిదో సెంచరీ. 96 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ మరో 48 బంతుల్లోనే మూడంకెల మార్కు అందుకోవడం విశేషం. టీ విరామానికి భారత్ 215/2తో బలమైన స్థితిలో నిలిచింది.

**ఆఖర్లో ఇద్దరూ..:** సెంచరీ సాధించి జోరు మీదున్న జైస్వాల్‌ను టీ విరామం అనంతరం స్టోక్స్ పెవిలియన్ చేర్చాడు. ఒక గుడ్ లెంగ్త్ బంతిని ఆడే ప్రయత్నంలో యశస్వి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో మూడో వికెట్ భాగస్వామ్యానికి 129 పరుగుల వద్ద తెరపడింది. ఈ స్థితిలో రిషబ్ పంత్‌తో కలిసి శుభ్‌మన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో తన శైలిలో ఆఫ్‌సైడ్ షాట్లతో అలరించిన శుభ్‌మన్ సెంచరీ చేసేందుకు తొందరపడలేదు. ఒక ఎండ్‌లో స్పిన్, మరో ఎండ్‌లో పేస్‌తో ఇంగ్లాండ్ పరీక్షించినా ఏకాగ్రత కోల్పోలేదు. 98 పరుగుల వద్ద రనౌట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న శుభ్‌మన్.. టంగ్ బౌలింగ్‌లో ఫోర్‌తో టెస్టుల్లో ఆరో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం తర్వాత కూడా శుభ్‌మన్ జోరు కొనసాగించడం.. పంత్ కూడా తనశైలిలో దూకుడుగా షాట్లు ఆడడంతో భారత స్కోరు పరుగులెత్తింది. వోక్స్ బౌలింగ్‌లో ఓ స్లాగ్‌స్వీప్ ఫోర్‌తో పంత్ అర్ధసెంచరీ అందుకున్నాడు. అబేధ్యమైన నాలుగో వికెట్‌కు శుభ్‌మన్–పంత్ జంట 138 పరుగులు జత చేసింది.

**భారత్ తొలి ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (బి) స్టోక్స్ 101; రాహుల్ (సి) రూట్ (బి) కార్స్ 42; సుదర్శన్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0; శుభ్‌మన్ బ్యాటింగ్ 127; పంత్ బ్యాటింగ్ 65; ఎక్స్‌ట్రాలు 24 మొత్తం: (85 ఓవర్లలో 3 వికెట్లకు) 359






శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ పైచేయి సాధించింది. ఆఫ్ స్పిన్నర్ నయీం హసన్ (5/121) విజృంభించడంతో శ్రీలంకపై బంగ్లాకు 10 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 368/4తో శుక్రవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక.. 131.2 ఓవర్లలో 485 పరుగులకు ఆలౌటైంది. కమిందు మెండిస్ (87; 148 బంతుల్లో 8×4, 1×6) రాణించాడు. నయీం, హసన్ మహమూద్ (3/74) సత్తా చాటడంతో బంగ్లాకు ఆధిక్యాన్ని అందించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా.. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 57 ఓవర్లలో 3 వికెట్లకు 177 పరుగులు సాధించింది. షాద్మాన్ ఇస్లాం

# అప్పుడు పటౌడీ కుటుంబంతో మాట్లాడా



భారత్– ఇంగ్లాండ్ మధ్య టెస్టు సిరీస్ పేరును తెందుల్కర్– అండర్సన్ ట్రోఫీగా మార్చినప్పుడు.. వెంటనే పటౌడీ కుటుంబానికి ఫోన్ చేసినట్లు దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ తెలిపాడు. ఎన్నో ఏళ్లుగా 'పటౌడీ ట్రోఫీ'గా ఉన్న పేరును ఈ సిరీస్ ముంగిట మార్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ మార్పు తర్వాత పటౌడీ కుటుంబం, ఐసీసీ, బీసీసీఐ, ఈసీబీతో చర్చల అనంతరం విజేత జట్టుకు పటౌడీ మెడల్ ఇవ్వాలని నిర్ణయించినట్లు సచిన్ చెప్పాడు. ''ట్రోఫీ పేరు మార్పు గురించి తెలియగానే పటౌడీ కుటుంబానికి ఫోన్ చేశా. పటౌడీ వారసత్వాన్ని ఎలా కొనసాగించాలన్న విషయంలో చర్చించుకున్నాం. ఈ విషయంలో నా శాయశక్తులా ప్రయత్నిస్తానని చెప్పా. జై షా, బీసీసీఐ, ఈసీబీతో మాట్లాడి నా ఆలోచనలు పంచుకున్నా. సిరీస్ విజేత జట్టు కెప్టెన్‌కు పటౌడీ మెడల్ ఇవ్వాలని నిర్ణయించడం ఆనందం కలిగించింది. మంచి సారథిగా పేరు తెచ్చుకున్న గొప్ప వ్యక్తి పటౌడీ. విజేత కెప్టెన్‌కు పటౌడీ మెడల్‌ను అందించడం సముచితంగా ఉంటుంది'' అని సచిన్ వివరించాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor: Gaddam Shyam. RNI No APTEL/2010/32877.